సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 15 । మార్చి । 2025


స్టేడియం వద్ద హాజరైన భక్తులు



న్యూస్‌రీల్

వైభవంగా చండీహోమం, అభిషేక పూజలు


హోమంలో పాల్గొన్న భక్తులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మ తల్లి) ఆలయ యాగశాలలో పౌర్ణమిని పురస్కరించుకుని చండీహోమం, అమ్మవారి సన్నిధిలో పంచామృతాభిషేకం నిర్వహించారు. తొలుత మేళతాళాల నడుమ అర్చకులు అమ్మవారి జన్మస్థలంలో పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి చండీహోమం చేశారు. పూజల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

జానకీ సదనానికి రూ.6లక్షల విరాళం


ఈఓకు చెక్‌ను అందచేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన నిర్మించే జానకీ సదనంలో ఓ గది నిర్మాణానికి దాతలు శుక్రవారం రూ.6 లక్షల విరాళం అందజేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఎస్.కృష్ణదేవరాయులు – అచల దంపతులు, శాంత పార్వతిదేవి, ఎస్.విజయలక్ష్మీదేవి ఉమ్మడిగా చెక్కు రూపంలో విరాళం అందజేశారని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, దాతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు..

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


పంపుహౌస్ వద్ద మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగర్ నీరు అందించడానికి రూ.66కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు నాణ్యతగా చేస్తూనే సకాలంలో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వకు ఆనుకుని నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఉగాది నాటికి ట్రయల్ రన్ జరిపేలా పనుల్లో వేగం పెంచాలని, ఏకకాలంలో పంప్‌హౌస్, పైపులైన్ పనులు చేపడితే సకాలంలో పూర్తవుతాయని తెలిపారు. తద్వారా సాగర్ జలాలను మండలంలోని చెరువుల్లో నింపొచ్చని మంత్రి పేర్కొన్నారు.


పసుపు కొమ్ములు దంచుతున్న ఈఓ రమాదేవి, భక్తులు


ఊరేగింపుగా వెళ్తున్న ఈఓ రమాదేవి, అర్చకులు

- భద్రగిరిలో సీతారాముల పెళ్లి పనులు ప్రారంభం
- పసుపు దంచడంతో పాటు తలంబ్రాల తయారీ
- వైభవోపేతంగా వసంతోత్సవం, డోలోత్సవం

సప్తవర్ణాల రామయ్య!



భద్రాచలం: ఇంద్రధనస్సును తలపించేలా రంగులు.. వేలాదిగా హాజరైన భక్తజనం.. తలంబ్రాల తయారీతో మహిళల ఆనందోత్సవాలు... పాదయాత్రగా గోటి తలంబ్రాలు తీసుకొచ్చిన భక్తుల రామనామస్మరణతో భద్రగిరి సందడిగా మారింది. భద్రాచలంలో శ్రీరామనవమికి ముందు ఏటా నిర్వహించే తొలి వేడుక శుక్రవారం వైభవోపేతంగా సాగింది. ప్రతీ జంటకు ఆదర్శంగా నిలిచే కల్యాణ రాముడి పెళ్లి పనుల్లో భాగంగా మహిళలు సంప్రదాయబద్ధంగా పసుపు కొమ్ములు దంచే పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వసంతోత్సవం, డోలోత్సవ సంబురాలతో దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలం మురిసిపోయింది.

పసుపు కొమ్ములు దంచి.. తలంబ్రాలు కలిపి

ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున పసుపు కొమ్ములను దంచి తలంబ్రాల తయారీతో పెళ్లి పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. రెండేళ్లగా భక్తులను సైతం భాగస్వాములను చేస్తుండడంతో మిథిలా స్టేడియం, వైకుంఠ ద్వారం వద్ద ఈ ఏడాదీ కొనసాగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ పల్లకీసేవగా స్వామి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారికి, రోళ్లు, రోకళ్లకు అర్చకులు, పండితులు పూజలు చేశారు. ఆపై ఆలయ ఈఓ రమాదేవి, అర్చకుల, పండితుల సతీమణులతో పసుపు కొమ్ములు దంచి పెళ్లి పనులను ప్రారంభించారు. ఆపై బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులామ్, సుగంధద్రవ్యాలను కలిపి తలంబ్రాలను సిద్ధం చేయడంతో పాటు తొలి తలంబ్రాలను ఆలయ అధికారులు తలపై ధరించి స్వామి వారి మూలమూర్తుల పాదాల చెంతన ఉంచారు.


వసంతోత్సవంలో సీతారాములు

వసంతోత్సవంతో శోభ

శ్రీ సీతారాములకు వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించిన అర్చకులు తొలుత బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులతో పాటు సువర్ణలక్ష్మి అమ్మవారికి పంచామృతంతో కలశాభిషేకం, సహస్ర ధారతో స్నపనం జరిపారు. ప్రత్యేకంగా అలకరించిన ఊయలపై శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను ఆశీనులు చేశారు. ఆస్థాన గాయకులు రామదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అర్చకులు పూజలు చేశారు. అనంతరం స్వామికి నక్షత్ర హారతి సమర్పించడంతో పాటు వసంతాలను శ్రీ సీతారాములపై చల్లిన అర్చకులు వసంతోత్సవాన్ని ప్రారంభించారు. ఆపై భక్తులపైనా రంగులు చల్లడంతో బేడా మండపం రంగులమయంగా మారింది. ఇక సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

కాంటా కొడుతున్నారు..


కొత్తగూడెంలోని రైతుబజార్, మున్సిపల్ మార్కెట్లలో చాలా మంది వ్యాపారులు పాతకాలం నాటి తరాజులు, బాట్లనే వినియోగిస్తున్నారు. పావు కిలో, అరకిలో బాట్లు లేకున్నా వాటి బదులు టమాటాలు, ఆలుగడ్డలను వాడుతుండడం కనిపించింది. తద్వారా 50 నుంచి 100గ్రాములకు పైగా తేడా వస్తోంది. అలాగే, బాట్లపై ఏటా తూనికలు, కొలతల శాఖ వద్ద స్టాంప్ వేయించాల్సి ఉన్నా ఎక్కడా కానరాలేదు.

జ్యూయలరీ షాపుల్లో ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లు వాడుతున్నా అవి సరిగ్గా పని చేస్తున్నాయా.. లేదా అనేది స్పష్టత రాలేదు. అధికారులు ఏటా ఓసారి తనిఖీలు చేస్తున్నామని చెబుతున్నా చాలా మిషన్లపై స్టాంప్‌లు కనిపించలేదు.

ప్రస్తుతం కేజీ మటన్ రూ.800కుపైగానే పలుకుతుండగా మటన్ దుకాణాల్లోనూ పాతకాలం నాటి తరాజులనే వినియోగిస్తున్నారు. దీంతో అటు తూకం, ఇటు నాణ్యత విషయంలోనూ మోసపోతున్నామని వినియోగదారులు వెల్లడించారు. ప్రతీ కేజీ మటన్‌కు 100 గ్రాములపైగా తేడా వస్తోందని చెప్పారు.

- కూరగాయల నుంచి బంగారం వరకు ఇదే తంతు..
- అడుగడుగునా మోసపోతున్న వినియోగదారులు
- అయినా తమకేమీ పట్టనట్లుగా అధికారుల తీరు

నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం



స్టాంప్ లేని బాటుతో కూరగాయాలు తూకం

కొత్తగూడెంఅర్బన్: నిత్యం ఉపయోగించే ఉప్పు, పప్పు మొదలు ఫోన్లు, టీవీలు ఇలా ఏదైనా సరే డబ్బు చెల్లించి కొంటున్న వారంతా వినియోగదారులే. కానీ చాలా మంది నాణ్యత, ధరలు, ప్యాకింగ్‌లో తేడాతో మోసపోతున్నారు. వ్యాపారుల తీరుతో ఈ పరిస్థితి ఎదురవుతుండగా తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీల మాటే మరువడంతో మోసాల స్థాయి నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యాన నేడు(శనివారం) వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు షాపుల్లో శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యాన పరిశీలించగా నాణ్యతలో లోపాలే కాక కల్తీ జరుగుతున్నట్లు తేలింది.

మోసాలకు అడ్డుకట్ట ఏదీ?

కూరగాయల దుకాణాలతో పాటు కిరాణం షాపులు, సూపర్‌మార్కెట్లలో వినియోగదారులు నిత్యం మోసానికి గురవుతున్నట్లు తేలింది. చాలావరకు షాపుల్లో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లకు బదులు తరాజులు, బాట్లు వాడుతున్నారు. వీటిని ఏటా తనిఖీ చేసి బరువు సరిగ్గా ఉందని నిర్ధారించి స్టాంప్ వేయించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అటు అధికారులు కూడా తనిఖీల మాటెత్తకపోవడంతో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది.

జిల్లాలో కేసులు ఇలా...

జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు తూనికలు, కొలతల శాఖ అధికారులు 353 కేసులు నమోదు చేసి రూ.13 లక్షల జరిమానా విధించారు. అయితే, ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో, తమకు తోచినప్పుడు మాత్రమే తనిఖీలు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాకాకుండా నిత్యం తనిఖీలు చేపడితే వ్యాపారుల తీరులో మార్పు రావడమే కాక వినియోగదారులకు నష్టం జరగకుండా అడ్డుకట్ట వేయొచ్చు. కాగా, వినియోగదారులు మోసపోయామని భావిస్తే 98491 28458 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి సూచించారు.

తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి

డబ్బు చెల్లించే వారంతా వినియోగదారులుగానే భావించాలి. ప్రతీ వస్తువుకు బిల్లు తీసుకుంటే ఏ మాత్రం తేడా ఉన్నా వినియోగదారుల వివాదాల పరిష్కారం కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. కానీ చాలామంది బిల్లులు తీసుకోకపోవడంతో నష్టపోయామని తెలిసినా పరిహారం అందే పరిస్థితి ఉండడం లేదు.

– జూలూరి రఘుమాచారి, కన్జూమర్స్, ఇన్ఫర్మేషన్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం అధ్యక్షుడు

సాగుకు పైసల్లేవు..

- కౌలు రైతులపై కనికరం చూపని ప్రభుత్వం
- పెట్టుబడి సాయంపై ఆశలు వదిలేసుకుంటున్న అన్నదాతలు
- ఎన్నికల హామీని పాలకులు విస్మరించారని ఆవేదన


సాగుకు భూమి సిద్ధం చేస్తున్న కౌలు రైతు (ఫైల్)

బూర్గంపాడు: గత ప్రభుత్వ పాలనలో పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడిన కౌలు రైతులకు ప్రస్తుత ప్రభుత్వం కూడా మొండిచేయి చూపుతోందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కౌలురైతులకూ పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించడం లేదు. రైతు భరోసా నిధుల విడుదలలో ఎక్కడా కౌలు రైతుల ఊసెత్తడం లేదు. గత పది నెలల క్రితం మంత్రులతో సబ్ కమిటీ వేసిన ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించినా ఇప్పుడు పట్టనట్లు వ్యవహరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

55 వేల మంది.. 1.30లక్షల ఎకరాలు

జిల్లాలో సుమారు 55వేల మంది వరకు కౌలు రైతులు ఉండగా.. వీరు సుమారు 1.30లక్షల ఎకరాల్లో పట్టాదారుల నుంచి భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తున్నారు. వీరికి గత ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు పథకం వర్తించలేదు. పంటలు సాగు చేసినా, చేయకున్నా పట్టాదారుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు నగదు జమయ్యేది. అలాగే బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకునే అవకాశం కూడా లేదు. కేవలం ప్రైవేట్ అప్పులతోనే కౌలు రైతులు పంటలు సాగు చేసే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినా వీరికి రూపాయి పరిహారం కూడా అందదు. పట్టాదారులు కనికరిస్తే తప్ప వారికి పంట నష్టపరిహారం కూడా అందే పరిస్థితులు లేవు. ఇక కౌలు రైతులు పండించిన పంటలను ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మాలంటే మళ్లీ పట్టాదారుల పేరుమీదనే అమ్మడం.. ఆపై వారి ఖాతాల్లో నగదు అయితే తీసుకోవడం పరిపాటిగా మారింది. మరోపక్క కౌలురైతులు సాగు చేసే పంటలకు ప్రభుత్వం అందించే పంటల బీమా కూడా వర్తించడం లేదు. ఈ పరిస్థితులను గుర్తించి కౌలురైతులకు కూడా పెట్టుబడి సాయమందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయాన హామీ ఇచ్చినా ఆ హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

గుర్తించడమే సమస్య

కౌలు రైతుల గుర్తింపే ప్రభుత్వాలకు పెద్దసమస్యగా భావిస్తున్నారు. పట్టాదారులెవరూ తమకు వచ్చే రైతు భరోసాను వదులుకుని కౌలురైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండరు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలురైతు చట్టం ప్రకారం భూయజమాని, కౌలురైతులు ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మాట్‌లో సంతకాలు చేసేవారు. నాడు బ్యాంకుల్లో కౌలు రైతుల పంటరుణాల కోసం ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం భూ యజమానులు తమకు ప్రభుత్వం నుంచి వచ్చే రైతుభరోసాను వదులుకుని కౌలు రైతులకు ఇచ్చే పరిస్థితులు లేకపోవడంతో కౌలు రైతుల గుర్తింపు, వారికి రైతు భరోసా వర్తింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సాయం అందడం లేదు



ఏటా 15 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి వేస్తున్నా. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందలేదు. పత్తి అమ్మాలన్నా పట్టాదారులను బతిమాలి పత్రాలు తీసుకోవాల్సి వస్తోంది. మాలాంటి వారికి పెట్టుబడి సాయం లేదా బోనస్ అందించాలి.

– పునుగుపాటి కృష్ణ, కౌలు రైతు, నాగినేనిప్రోలు

కౌలు రైతులను ఆదుకోవాలి



కౌలు రైతులను ప్రభుత్వం ఇకనైనా ఆదుకోవాలి. మాలాంటి వారికి గత ప్రభుత్వంతో పాటు ఇప్పటి ప్రభుత్వం సైతం ఎలాంటి సాయం చేయడం లేదు. పంటలు పండకపోయినా, వరదలకు దెబ్బతిన్నా, వర్షాభావంతో ఎండిపోయినా కౌలు రైతులకే నష్టం.

– ఉడుగుల సత్యం, కౌలు రైతు, గొమ్మూరు

పోస్టాఫీస్ ద్వారా పరోక్ష సేవలు

అంతరాలయ అర్చన, తలంబ్రాలకు అవకాశం

భద్రాచలం: పోస్టాఫీస్ ద్వారా భద్రగిరి రామయ్య పరోక్ష సేవలు అందించటానికి తపాలా శాఖ సిద్ధమైంది. శ్రీ సీతారాముల కల్యాణం, మహాపట్టాభిషేకంలో స్వయంగా పాల్గొనలేని భక్తులు సమీపాన పోస్టాఫీస్‌కు వెళ్లి అంతరాలయ అర్చన, తలంబ్రాలకైతే రూ.450, ముత్యాల తలంబ్రాలకు రూ.150 చొప్పున చెల్లించి పూర్తి వివరాలతో దరఖాస్తు అందజేయాలి. ఆపై స్వామి వారి తలంబ్రాలు భక్తులకు చేరవేస్తామని, ఈ అవకాశం ఏప్రిల్ 1వ తేదీ వరకే ఉంటుందని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి, భద్రాచలం హెడ్ పోస్టాఫీస్ పోస్‌మాస్టర్ బీ.వీ.రామ్మోహన్‌రావు తెలిపారు.

రంగుల హరివిల్లు..

ఊరువాడ ఘనంగా హోలీ వేడుకలు


అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో విద్యార్థుల బురదోత్సవం




పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ఎస్పీ రోహిత్‌రాజు, పోలీసు అధికారులు


టేకులపల్లిలో జరిగిన హోలీ వేడుకల్లో చిన్నారులు

జిల్లావాసులు హోలీ వేడుకలు శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ సంబరంగా గడిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లలో సామూహికంగా రంగుల పండుగ జరుపుకోగా.. పలువురు జట్లుగా విడిపోయి స్నేహితుల ఇళ్లకు వెళ్లి రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఉద్యోగులతో కలిసి ఎస్పీ రోహిత్‌రాజ్ హోలీ జరుపుకున్నారు. పాటలకు అనుగుణంగా డప్పు మోగిస్తూ నృత్యం చేసిన ఆయన ఉద్యోగులను ఉత్సాహపరిచారు. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, ఎస్.చంద్రభాను, రవీందర్‌రెడ్డితో పాటు సీఐ బత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు రంగులకు బదులు బురదలో హోలీ వేడుకలు జరుపుకోవడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

పోతమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం శివారులో ఏకుల పోతమ్మ ఆలయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు. చైర్మన్ దొడ్డా భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, కేవీ సత్యనారాయణ, దొడ్డా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం


స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించారు. వేలాదిగా హాజరైన భక్తుల నడుమ అర్చకులు స్వామి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీ.వీ.రమణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, శివాలయం వ్యవస్థాపక ధర్మకర్త మారగాని శ్రీనివాసరావుతో పాటు వనమా గాంధీ, వర్సా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టు ఎక్కుతూ కిందపడి వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్: తాటి ముంజల కోసం చెట్టు ఎక్కుతూ కింద పడటంతో పట్టణంలోని 14 నంబర్‌బస్తీకి చెందిన బాలప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. బంధువుల కథనం ప్రకారం.. కొమరారం శివారులో తమ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న తాటి చెట్ల నుంచి ముంజలు కోసేందుకు శుక్రవారం తోటకు వెళ్లిన బాలప్రసాద్ చెట్టు ఎక్కుతున్న క్రమంలోనే పట్టుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రశ్నిద్దాం.. అది మన హక్కు

- వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం
- 1986లో ఏర్పాటు.. 2019లో మరింత బలోపేతం
- ఇప్పటివరకు జిల్లాలో 10,206 కేసులు.. 10,055 పరిష్కారం

నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం



ఖమ్మంలీగల్: కొనుగోళ్లు, సేవల కోసం డబ్బు చెల్లించే ప్రతీఒక్కరు వినియోగదారులుగానే పరిగణనలోకి వస్తారు. ఈసమయాన నాణ్యతను ప్రశ్నించడం, రశీదు తీసుకోవడం, ధరల తెలుసుకోవడం హక్కుగా సంక్రమిస్తాయి. అదేసమయాన చౌకబారు, నాణ్యత లేని వస్తువులు వచ్చినట్లు తెలిస్తే ప్రశ్నించడం కూడా వినియోగదారుల హక్కుగానే భావించాలి. నేడు(శనివారం) వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హక్కుల రక్షణకు ఉన్నచట్టం, ఫిర్యాదు చేయాల్సిన తీరు, ఇటీవల వెలువడిన తీర్పులపై కథనం

న్యాయం.. నష్టపరిహారం

వినియోగదారుల రక్షణ చట్టం -1986 ద్వారా ఫిర్యాదు వినడంతో పాటు న్యాయం చేయడమే కాక నష్ట పరిహారం ఇప్పించడానికి ఒక వ్యవస్థ ఏర్పడింది. ఈ చట్టం 1986లో వచ్చింది. అంతకు ముందు వినియోగదారులు 40 రకాల చట్టాలపై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో ఇంగ్లాండ్, అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేశాక ప్రత్యేక తీసుకొచ్చారు. ఆ తర్వాత 2019లో మరింత బలోపేతం చేస్తూ కొత్త చట్టం ఏర్పరిచారు. అంతర్జాల వేదికలు, ఈ-కామర్స్ ద్వారా కూడా రక్షణ లభించేలా ఇందులో నిబంధనలు పొందుపరిచారు. చట్టం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 10,206 కేసులు నమోదు కాగా.. వీటిలో 10,055 పరిష్కారమయ్యాయి.

ధంసలాపురానికి చెందిన తుమ్మ అప్పిరెడ్డి భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్లేందుకు హైదరాబాద్‌లోని అర్చన ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టూర్ ఆపరేటర్ బద్దం బోజిరెడ్డి ద్వారా 2023 ఏప్రిల్‌లో రూ.71వేలు చెల్లించి ప్యాకేజీ తీసుకొన్నారు. ఆపై రకరకాల కారణాలతో వాయిదా వేస్తుండగా, అప్పిరెడ్డి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కారం కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ చేసిన అనంతరం టూర్ కోసం చెల్లించిన రూ.71వేలు, కేసు నమోదు చేసిన నాటి నుంచి ఏడు శాతం వడ్డీతో కలిపి చెల్లించడమే కాక ఇబ్బందికి వేదనకు రూ.10వేలు, లిటిగేషన్ ఖర్చులకు రూ.10వేలు కూడా చెల్లించాలని తీర్పునిచ్చింది.


ఖమ్మంలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

చట్టం లక్ష్యాలు

దోపిడీకి గురైన, మోసపోయిన, దొంగ వ్యాపారంతో విసిగిపోయిన వినియోగదారులకు రక్షణ కవచంలా ఈ చట్టం ఉపయోగపడుతుంది. కష్టాలు, నష్టాలు, కడగండ్ల నుంచి తప్పించడానికి సాయపడుతోంది. సాధారణ, తక్కువ ఖర్చు, కాలయాపన లేకుండా న్యాయం చేకూర్చడమే ఈ చట్టం ఉద్దేశం.

ఫిర్యాదులు

జిల్లా పరిధిలో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటైంది. ఎవరైనా వ్యక్తిగా, సామూహికంగా ఫిర్యాదు చేయొచ్చు. అలాగే, కేంద్ర, రాష్ట్ర, జిల్లాస్థాయిలో మూడంచెలుగా న్యాయవ్యవస్థ, జాతీయ కమిషన్, రాష్ట్ర వినియోగదారుల వివాదాల నివారణ కమిషన్, జిల్లా స్థాయిలో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటైంది. కొన్న వస్తువులు పాడైనా, నాసిరకంవి వచ్చినా, ఆశించిన రీతిలో లేకున్నా, లోపాలు ఉన్నా, అధికధర వసూలు చేసినా రాతపూర్వకంగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయొచ్చు.

జరిమానా.. శిక్షలు

ఎవరికి వ్యతిరేకంగానైతే ఉత్తర్వులు జారీ అవుతాయో, వాళ్లు ఆ ఉత్తర్వులను అమలుపర్చకపోతే వారికి శిక్ష విధించే అధికారం ఫోరమ్‌లు, కమిషన్లకు ఉంటుంది. వ్యక్తికి నెల తగ్గకుండా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.2వేలు తగ్గకుండా రూ.10వేల వరకు జరిమానా లేదా ఈ రెండింటినీ విధించవచ్చు. అయితే, వీటిపై అప్పీల్‌కు వెళ్లొచ్చు.

జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో నమోదైన కేసులు

ఏడాది	కేసులు
2021	100
2022	172
2023	138
2024	102
2025(ఇప్పటివరకు)	27

ఫిర్యాదు చేయడం ఇలా...

వస్తువు ధర ఆధారంగా రూ.50లక్షల నష్టపరిహారం వరకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసే అవకాశముంది. ఇక రూ.50లక్షలకు పైన రాష్ట్ర వినియోగదారుల ఫోరం, ఆపైన జాతీయ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలి. కోర్టు రుసుముతో పాటు ఫిర్యాదు ఆధారంగా ఫీజు చెల్లించి పూర్తి వివరాలు సమర్పించాలి. వినియోగదారుల తరుపున న్యాయవాది లేదా సొంతంగానూ వాదనలు వినిపించవచ్చు. అయితే, వివాదం తలెత్తిన రెండేళ్ల లోపు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. e.jagrithi.gov. in ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇతర వివరాల కోసం 08742- 254347 నంబర్‌లో సంప్రదించవచ్చు.

తల్లాడ మండలం మల్లవరానికి చెందిన దుగ్గిదేవర వెంకటలాల్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. కోవిడ్ బారిన పడిన ఆయన ఆస్పత్రిలో చికిత్సకు రూ.54,963 బిల్లు చెల్లించాడు. ఈ బిల్లు ఇవ్వాలని బీమా కంపెనీని సంప్రదిస్తే నిరాకరించారు. దీంతో సేవాలోపం కింద ఆయన జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 2022 జనవరి 28న ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఇరుపక్షాల వాదనలు విన్న సేవా లోపం జరిగిందని నిర్ధారించారు. దీంతో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ(వనస్థలిపురం) తరఫున ఫిర్యాదికి రూ.73,707 చెల్లించాలని తీర్పు చెప్పారు.

కొలువు.. మాకిది సులువు..

- పట్టుబట్టారు.. ఉద్యోగాలు సాధించారు..
- ఒకటికి మించి జాబ్‌లు కొల్లగొట్టిన యువత
- ఇప్పటికే ఉద్యోగాలు చేస్తూనే విజయకేతనం ఎగురవేసిన కొందరు
- గ్రూప్ 1, 2, 3కి తోడు జేఎల్‌గా ఎంపికైన పలువురు

యువత అనుకుంటే సాధించలేనిదేదీ లేదని, కొలువు కొట్టడం మాకెంతో సులువైన పని అని పలువురు నిరూపించారు. స్పష్టమైన లక్ష్యాలు ఉండడం లేదని, గాలివాటంగా వెళ్తున్నారని కొన్ని కుటుంబాల్లో పెద్దల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ ఇంకొందరు మాత్రం వాటిని పటాపంచలు చేస్తూ సత్తాచాటుతున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్ - 1, 2, 3 ఫలితాలతోపాటు జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన వారిని పరిశీలిస్తే కఠోర శ్రమ.. పట్టుదల చూపించి.. ఉద్యోగాలు సాధించారని వెల్లడవుతోంది. స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకోవడమే కాక నిరంతరం శ్రమించడం, ఒక ఉద్యోగం వచ్చినా పట్టు వీడకుండా మరిన్ని ఉద్యోగాలు సాధిస్తున్న యువత ఇంకొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి..


కటికి ఉపేంద్ర

తల్లాడ: మండలంలోని మల్లవరానికి చెందిన కటికి ఉపేంద్రకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా వదులుకుని ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమించాడు. తాజాగా ఆయన గ్రూప్-3లో 384వ ర్యాంక్ సాధించాడు. ఆయన రెండేళ్ల వయస్సులోనే తండ్రి బాబూరావు ప్రమాదవశాత్తు మృతి చెందగా తల్లి ప్రోత్సాహంతో పట్టుదలగా చదివాడు. ఆయన 1 - 4వ తరగతి వరకు సాయిచైతన్య, 5 - 10వ తరగతి వరకు బాలభారతి విద్యాలయం, ఇంటర్ ఖమ్మం రెజోనెన్స్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశాడు. తల్లి సాయమ్మ ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉపేంద్రను పలువురు అభినందిస్తున్నారు.

గోపీచంద్.. లక్ష్యం ఐఏఎస్

జూలూరుపాడు: గ్రూప్-3 ఫలితాల్లో మండలంలోని సూరారానికి చెందిన బానోత్ గోపీచంద్ 450 మార్కులకు 279 మార్కులతో 611వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-2లోనూ 345వ ర్యాంకు సాధించడం విశేషం. వ్యవసాయ కుటుంబానికి చెందిన మాజీ సర్పంచ్ బానోత్ హరిలాల్ - పార్వతి దంపతుల కుమారుడైన గోపిచంద్ బీటెక్ తర్వాత హైదరాబాద్‌లో ఉంటూ గ్రూప్స్‌కు సిద్ధమయ్యాడు. గ్రూప్-1లో మెరుగైన ఫలితం రాకున్నా గ్రూప్-2, 3లో సత్తా చాటాడు. అయితే, గ్రూప్-2 ఉద్యోగం ఎంచుకున్నా ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని గోపీచంద్ తెలిపాడు.


తల్లిదండ్రులతో గోపీచంద్

గ్రూప్-2 ర్యాంకర్‌కు సన్మానం


గోపాల్‌రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

బోనకల్: మండలంలోని జానకీపురానికి చెందిన కోటా గోపాల్‌రావు గ్రూప్-2 ఫలితాల్లో 652వ ర్యాంక్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తూ 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా, 2024లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో పాటు గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మధిర తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రూప్-2లో ర్యాంక్ సాధించిన గోపాల్‌రావును గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు.

సౌమ్య.. గ్రూప్-2, 3


కల్యాణపు సౌమ్య

బోనకల్: గ్రూప్-2, 3 ఫలితాల్లో మండలంలోని గోవిందాపురాని(ఎల్)కి చెందిన కల్యాణపు సౌమ్య మెరుగైన ర్యాంకులు సాధించింది. ఈ నెల 12న విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో 533, శుక్రవారం వెల్లడైన గ్రూప్-3లో 191వ ర్యాంక్ సాధించడం విశేషం. గతంలో బోనకల్ మండలం రామాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆమె సెలవు పెట్టి పరీక్షలకు సిద్ధమై మెరుగైన ర్యాంకులు సాధించగా పలువురు అభినందించారు.

ఆఫ్రిద్.. వరుస ఉద్యోగాలు


మహ్మద్ ఆఫ్రిద్

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు మహ్మద్ రజాక్ - ఫాతిమా దంపతుల రెండో కుమారుడు ఆఫ్రిద్ వరుసగా ఉద్యోగాలు సాధిస్తున్నాడు. బీఈ మెకానికల్ ఇంజనీరింగ్, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసిన ఆయన గతంలోనే ఆర్‌ఆర్‌బీ ఎన్‌టీపీసీలో ఉద్యోగాలు సాధించాడు. అలాగే, గ్రూప్-4లో జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించి ప్రస్తుతం రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ గ్రూప్-1లో 448 మార్కులు, గ్రూప్-2లో 377 మార్కులతో రాష్ట్రస్థాయి 313 ర్యాంకు, గ్రూప్-3లో 22వ ర్యాంక్ సాధించడం విశేషం. ఇక జూనియర్ లెక్చరర్ పరీక్షలో రాష్ట్రస్థాయి 21వ ర్యాంక్ సాధించిన ఆఫ్రిద్ పలువురి అభినందనలు అందుకుంటున్నాడు.

గ్రూప్-1, 2 ఫలితాల్లో సోదరుల హవా


వెంకటేశ్, హరికృష్ణ

పాల్వంచ: ఇటీవల విడుదలైన గ్రూప్-1, 2 ఫలితాల్లో అన్నదమ్ములు సత్తా చాటారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికి చెందిన సీతా లక్ష్మి, కొమురయ్యకు ఇద్దరు కుమారులు. కాగా పెద్ద కుమారుడు వెంకటేశ్ కేటీపీఎస్ 5దశ కర్మాగారంలోని యూసీబీలో షిఫ్ట్ ఏఈగా పనిచేస్తున్నాడు. ఇతను ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 466 మార్కులు సాధించారు. ఆయన సోదరుడు హరికృష్ణ గ్రూప్-2 ఫలితాల్లో 184 ర్యాంక్ సాధించారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ అనైతికం

మణుగూరురూరల్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తన గళం వినిపిస్తున్న నేపథ్యంలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అనైతికమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలనే డిమాండ్‌తో మణుగూరులో కాంతారావు ఆధ్వర్యంలో నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలపై నిలదీస్తుండడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. కాగా, బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా మణుగూరు ఎస్‌ఐలు మేడా ప్రసాద్, రంజిత్, ట్రెయినీ ఎస్‌ఐ మనీషా, సిబ్బందితో చేరుకుని రేగా, నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై వదిలేశారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, నాయకులు నూకారపు రమేశ్, పట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, అక్కి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే రేగా, బీఆర్‌ఎస్ నాయకులు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

అడ్డుకున్న పోలీసులు, అదుపులో బీఆర్‌ఎస్ నేతలు

ఇల్లెందు: ప్రజాపాలన సాగిస్తున్నామని చెబుతున్నా అసెంబ్లీలో ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేయడమే కాక నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని జిల్లా గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ పేర్కొన్నారు. అసెంబ్లీ నుంచి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై నిరసనగా ఇల్లెందు జగదాంబసెంటర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దిష్టిబొమ్మను లాక్కొని, బీఆర్‌ఎస్ నేతలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజేందర్ మాట్లాడుతూ.. జగదీశ్‌రెడ్డి అక్రమ సస్పెన్షన్‌ను ప్రశ్నిస్తే తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరా భావ్‌సింగ్, ఆదూరి రవితో పాటు రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, మహేందర్, హరిప్రసాద్‌యాదవ్, హరికృష్ణ, చాంద్‌పాషా, వసంత్, సురేశ్, మునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నించిన బీఆర్‌ఎస్ నేతలు దిండిగాల రాజేందర్, అజ్మీరా బావ్‌సింగ్, ఆదూరి రవిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.


దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సీతారామా.. తలంబ్రాలు ఇవిగో..!

- రామయ్య కల్యాణానికి సమర్పించిన భక్తజనం
- భక్తి శ్రద్ధలతో పండించి.. గోటితో వలిచి తీసుకొచ్చిన పలువురు
- ఉమ్మడి రాష్ట్రం నుంచి తరలివచ్చిన భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరిగే సీతారాముల కల్యాణ ఘట్టంలో తలంబ్రాలు ప్రధానమైనవని చెప్పాలి. స్వామి, అమ్మ వార్ల కల్యాణ తంతు ముగియగానే వారి పైనుంచి జాలువారిన తలంబ్రాలు దక్కించుకునేందుకు భక్తజనం పోటీ పడతారు. కొందరు తలంబ్రాలను ఇళ్లలో దేవుళ్ల చిత్రపటాల వద్ద ఉంచి పూజలు చేస్తే.. ఇంకొందరు పంట భూముల్లో చల్లితే దిగుబడి పెరుగుతుందని నమ్ముతారు. ఇంతటి విలువైన తలంబ్రాలను భక్తిశ్రద్ధలతో పండించి.. స్వయంగా గోటితో వలిచి స్వామి వారికి సమర్పించేందుకు దేశ నలుమూలల నుంచి భద్రగిరికి వస్తారు. రామయ్య కల్యాణ పనులు మొదలైన రోజునే తలంబ్రాలను కలపడం ఆనవాయితీ కావడంతో ఎప్పటిలాగే పౌర్ణమి రోజు జరిగిన ఈ క్రతువుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుదూర ప్రాంతాల భక్తులు గురువారం రాత్రికల్లా భద్రాచలం చేరుకోగా.. శుక్రవారం ఉదయం ఆలయ ఆవరణలో తలంబ్రాలు కలిపే కార్యక్రమానికి తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొనగా.. రామనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.


తలంబ్రాలతో తరలివచ్చిన భక్తులు

కాలినడకన సైతం..

భద్రాచలంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణంలో వినియోగించే తలంబ్రాలను పండించేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. ఈ క్రమాన తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల భక్తులు తమ భూముల్లో భక్తి శ్రద్ధలతో వరినాట్లు వేసి పంట పండించాక... ధాన్యాన్ని గోటితో వలిచి తలంబ్రాలు సిద్ధం చేస్తారు. ఆపై కాలినడకన భద్రగిరికి వచ్చిన పలువురు దేవస్థానంలో ప్రధాన అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించి రామయ్యకు సమర్పించారు. ఇలా భక్తులు సమర్పించిన తలాంబ్రాలతో పాటు దేవస్థానం తరఫున తలంబ్రాలు, ముత్యాలను కలిపి సీతారాముల కల్యాణంలో వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది.

గోటి తలంబ్రాలతో కాలినడకన..

బూర్గంపాడు/టేకులపల్లి: బూర్గంపాడు మండలం సారపాకలోని శ్రీదాసాంజనేయ స్వామి ఆలయం, గాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో భక్తులు భద్రాద్రి రామయ్య కల్యాణానికి గోటితో తలంబ్రాలు వలిచారు. శుక్రవారం కాలినడకగా భద్రాచలం వెళ్లి రామాలయంలో తలంబ్రాలు సమర్పించారు. అలాగే, టేకులపల్లి నుంచి గోటితలంబ్రాలతో భద్రాచలానికి భక్తులు బయలుదేరారు. తొలుత టేకులపల్లి శ్రీకోదండ రామాలయంలో గుడిపూడి సబిత ఆధ్వర్యాన పూజలు చేయగా, ఆమెడ రమాదేవి, కేసా పద్మజ, ఆమెడ రేణుక, తుమ్మల సరిత, నెల్లూరి కస్తూరి, జాలాది కవిత, తోటకూరి స్వరూప, అనంతుల వసంత, వెంకటలక్ష్మి, రమ, రాయల ఇందిర, గుర్రం సుజన్య, ఎం.బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: గాంధీనగర్ శ్రీకృష్ణమందిరం నుంచి గోటి తలంబ్రాలతో భద్రాచలం వెళ్తున్న భక్తులు

ఐదేళ్లుగా సమర్పిస్తున్నా..



భద్రాచలంలో స్వామి కల్యాణంలో వినియోగించే తలంబ్రాలలో మేం పండించి తీసుకొచ్చిన తలంబ్రాలు కలిపేందుకు ఐదేళ్లగా వస్తున్నాం. మా కాలనీలో పలువురు భక్త మండలిగా ఏర్పాటై కాలినడకన వచ్చి రామయ్యకు తలంబ్రాలు సమర్పిస్తున్నాం.

-సరస్వతి, మహబూబాబాద్

తలంబ్రాలు కలిపేందుకు వచ్చాం



ఏటా సీతారాముల కల్యాణంలో వినియోగించే తలంబ్రాలు కలిపేందుకు బంధువులతో వస్తున్నా. రామనామ స్మరణతో తలంబ్రాలు కలుపుతుంటే సంతోషంతో మనసు పులకించిపోతుంది. పదేళ్లుగా వస్తున్నా ఎప్పటికీ కొత్త అనుభూతే ఉంటుంది.

-రమణ, హైదరాబాద్

కాలినడకన చేరుకున్నాం..



మా గ్రామంలో ప్రత్యేకంగా పండించిన పంటను మహిళలం భక్తిశ్రద్ధలతో గోటితో వలిచి తలంబ్రాలు తయారు చేశాం. వీటిని రామయ్యకు సమర్పించేందుకు కాలినడకన చేరుకున్నాం. నాలుగేళ్లుగా తలంబ్రాలను రామయ్య కల్యాణానికి సమర్పిస్తున్నాం.

-ఉమ, నారాయణపురం, ఖమ్మం

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఒకరు దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు


కొర్సా సత్తిబాబు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందారు. ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం టి.గంగన్నగూడెం గ్రామానికి చెందిన కొర్సా సత్తిబాబు (35), జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడేనికి చెందిన తన బావ మాదాసు శ్రీను కలిసి బైక్‌పై అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరయ్యారు. తర్వాత పక్కనే ఉన్న సత్తిబాబు అత్తారింటికి వెళ్లి తిరిగి తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ములకలపల్లి మండలం పొగళ్లపల్లి గ్రామానికి చెందిన అమరవరపు మనోహర్ వినాయకపురం నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. రెండు బైక్‌లు తిరుమలకుంట శివారులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ఎదురెదురుగా ఢీకొన్నాయి. సత్తిబాబు అక్కడికక్కడే మృతిచెందగా శ్రీను, మనోహర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దుకాణాల్లోకి దూసుకెళ్లిన వాహనం


దుకాణాల్లోకి దూసుకెళ్లిన మ్యాజిక్ వాహనం

చర్ల: మండల కేంద్రంలోని గొల్లగట్టు సమీపంలో గల సూపర్‌బజార్‌లోని దుకాణాల్లోకి మ్యాజిక్ వాహనం దూసుకెళ్లడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. అంబేడ్కర్ సెంటర్ వైపు నుంచి తహసీల్దార్ కార్యాలయం సెంటర్ వైపునకు వెళ్తున్న టాటా మ్యాజిక్ సూపర్‌బజార్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా ఉన్న మెకానిక్ షెడ్, ఎలక్ట్రికల్ రిపేరింగ్ దుకాణంలోకి వేగంగా దూసుకెళ్లింది. దీంతో ఎలక్ట్రీషియన్ వాసు, చక్రమ్మ మరొకరికి గాయాలయ్యాయి. చక్రమ్మను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ రాజు వర్మ తెలిపారు.